## క్లుప్తంగా

### కేజీబీవీలో వీడ్కోలు సమావేశం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కార్యక్రమాన్ని ఎస్‌వో కవిత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రానున్న వార్షిక పరీక్షల్లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థినులు చేసిన నృత్యాలు అలరించాయి.

### ఆటలో గెలుపోటములు సహజం

తిర్యాణి: ఆటలో గెలుపోటములు సహజమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జువ్వాజి అనిల్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని ఉల్లిపిట్ట గ్రామంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనిల్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ కోవ పార్వతి, కాంగ్రెస్ యూత్ జిల్లా అధ్యక్షుడు గుండా శ్యామ్, ఐటీడీఏ డైరెక్టర్ ఆత్రం లక్ష్మణ్, కై రిగూడ ఓసీ పీవో ఉదయ్‌కాంత్ తదితరులు ఉన్నారు.

### ఆలయ నిర్మాణానికి భూమిపూజ

నార్నూర్: మండలంలోని బలాన్‌పూర్‌లో కోవ వంశానికి చెందిన పెర్సాపెన్ ఆలయ నిర్మాణానికి బుధవారం కుమురం భీం (ఆసిఫాబాద్) జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తరతరాల నుంచి వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించాలన్నారు. కోవ వంశానికి చెందిన పెర్సాపెన్ (పెద్దదేవుడు) బలాన్‌పూర్‌లో ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

### విగ్రహావిష్కరణ విజయవంతం చేయండి

నార్నూర్: సాఅన్నాభావుసాఠె విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. బుధవారం అన్నాభావు సాఠె జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. విగ్రహ ఆవిష్కరణ, బహిరంగ సభల నిర్వహణపై చర్చించారు. ఈనెల 12న మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అన్నాభావుసాఠె విగ్రహావిష్కరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు యునుస్ అక్బానీ, అడే సురేశ్, కాంతరావు దుర్గే, కాంబ్లే ఉదయ్, కొర్రెళ్ల మహేందర్, రాజ్‌సంగే రాజు, నర్సింగ్ మోరే పాల్గొన్నారు.

### ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

తాంసి: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. బుధవారం మండలంలోని పొన్నారిలో నూతనంగా నిర్మించిన అభయ అంజనేయ స్వామి విగ్రహ ఆవిష్కరణలో భాగంగా పూజలు చేశారు. అనంతరం అంజనేయ స్వామి విగ్రహం ఊరేగింపులో పాల్గొన్నారు.

### సాక్షి సినిమాలు

**ఆసిఫాబాద్**
కుమురంభీం : ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు

**కాగజ్‌నగర్**
వెంకటరమణ : ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు

- ఆసిఫాబాద్‌అర్బన్

### కూరగాయల ధరలు

| కూరగాయలు | ధర(కిలో) |
|---|---|
| టమాటా | రూ.20 |
| సిమ్లామిర్చి | 80 |
| దోసకాయ | 40 |
| చామగడ్డ | 80 |
| వంకాయ | 40 |
| బీరకాయ | 40 |
| కాకరకాయ | 50 |
| బెండకాయ | 100 |
| అలసంద | 40 |
| దొండకాయ | 60 |
| పచ్చిమిర్చి | 50 |
| పాలకూర | 60 |
| సోరకాయ | 60 |
| చిక్కుడు కాయ | 30 |
| గోబి(పూల్) | 40 |
| క్యాబేజ | 40 |

-ఆసిఫాబాద్‌అర్బన్

# ఘనంగా మహిళా దినోత్సవం

ఆసిఫాబాద్‌అర్బన్: కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి



రెబ్బెన: కేక్ కట్ చేస్తున్న సిర్పూర్(యూ) జెడ్పీటీసీ కోవ అరుణ, సర్పంచ్ సుమలత



రెబ్బెన: బహుమతులు అందజేస్తున్న జీఎం దేవేందర్, సేవా అధ్యక్షురాలు స్వరూపారాణి



జిల్లాలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, కాగజ్‌నగర్ ఎంపీపీఎస్ సర్‌సిల్క్ పాఠశాలలో జరిగిన వేడుకలకు డీఈవో అశోక్, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సతీమణి రమాదేవి, గోలేటిటౌన్‌షిప్ సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఏరియా జీఎం దేవేందర్, సేవా సమితి అధ్యక్షురాలు స్వరూపారాణిలు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.



కౌటాల: విజయనగరంలో..



కాగజ్‌నగర్‌టౌన్: మహిళలకు సన్మానం



ఆసిఫాబాద్‌అర్బన్: ఎల్‌ఐసీ కార్యాలయంలో..



పోటీలు ప్రారంభిస్తున్న సర్పంచ్ సుమలత



రెబ్బెన: గోలేటిటౌన్‌షిప్ సీఈఆర్ క్లబ్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మహిళలు



ఆసిఫాబాద్: పార్కులో ఆర్యవైశ్య మహిళలు



రెబ్బెన: నృత్యం చేస్తున్న యువతి



సిర్పూర్(టి): కోర్టు ఆవరణలో వేడుకలు



రెబ్బెన: మాట్లాడుతున్న అదనపు కలెక్టర్



ఆసిఫాబాద్‌రూరల్: మహిళా టీచర్లను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

# ‘ప్రకృతి వనం’పై పట్టింపేది..?

- వందలాది మొక్కలు అగ్నికి ఆహుతి
- సంరక్షణ బాధ్యతలు గాలికొదిలేసిన అధికారులు
- వృథాగా లక్షల రూపాయల నిధులు



కొత్తగూడ పల్లె ప్రకృతివనం



నిప్పు అంటుకుని పూర్తిగా కాలిపోయిన మొక్కలు

రెబ్బెన: గ్రామాల్లో పచ్చదనం పెంపొందాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ హాబిటేషన్‌లో ఒక పల్లె ప్రకృతివనం చొప్పున ఏర్పాటు చేసింది. ఒక వైపు పచ్చదనం మరోవైపు ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేలా వీటిని సిద్ధం చేశారు. పంచాయతీలో హాబిటేషన్‌ల వారీగా అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను పల్లె ప్రకృతివనాలకు కేటాయించి ఒక్కో ప్రకృతివనంలో వందలాది మొక్కలను నాటి జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నారు. ప్రకృతివనం చుట్టూ కంచె ఏర్పాటు చేసి పశువులు లోపలికి రాకుండా చర్యలు తీసుకున్నారు. దాంతో ఏపుగా పెరిగిన చెట్లతో కొన్ని పల్లెప్రకృతి వనాలు పచ్చదనంతో కళకళలాడుతుండగా కొన్నిచోట్ల మాత్రం వీటి నిర్వహణ గాలికి వదిలేశారు. ప్రకృతివనంలో నాటిన మొక్కలకు సరిగా నీళ్లు పట్టకపోవడం, వాటి సంరక్షణ చేపట్టకపోవడంతో నాటిన కొన్ని నెలలకే మొక్కలు ఎండిపోయి ప్రకృతివనాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

**అగ్నికి ఆహుతి..**

రాష్ట్ర ప్రభుత్వం అడవుల శాతాన్ని పెంచేందుకు హరితహారం కార్యక్రమం ద్వారా ప్రతీ పంచాయతీలో వేలాది మొక్కలు నాటుతోంది. అదే తరహాలో పల్లె ప్రకృతివనాలను ఏర్పాటు చేసి ఒకేచోట పెద్ద ఎత్తున మొక్కలు నాటి పచ్చదనాన్ని కాపాడే ప్రయత్నం చేస్తోంది. అయితే మండలంలోని తుంగెడ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనాల నిర్వహణను అధికారులు నిర్లక్ష్యం చేశారు. తుంగెడ, కొత్తగూడ గ్రామాలకు సంబంధించిన ప్రకృతివనాలను కొత్తగూడకు సమీపంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలంలో ఒకేచోట అధికారులు ఏర్పాటు చేశారు. దాదాపు ఎకరం స్థలంలో రెండు వనాలకు కలిపి ఒకేచోట మొక్కలను నాటి పశువులు ప్రవేశించకుండా చైన్ లింక్ మెష్‌తో కూడిన కంచె సైతం ఏర్పాటు చేశారు. అయితే కొన్ని రోజుల క్రితం ఈ రెండు పల్లె ప్రకృతివనాల్లోని మొక్కలు నిప్పంటుకుని దాదాపు 80శాతం పూర్తిగా కాలిపోయాయి. పల్లె ప్రకృతివనాలకు ఆనుకుని ఉన్న మల్లన్న ఆలయానికి వచ్చిన భక్తులు పల్లె ప్రకృతివనంలో వంటకాలు చేసుకునేందుకు పొయ్యిలు ఏర్పాటు చేసుకుని నిప్పును ఆర్పివేయకుండా వదిలేయడంతో ప్రమాదం జరిగిందా..? లేదా ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించారా అనే దానిపై స్పష్టత లేకుండా పోయింది. ఏది ఏమైనా లక్షల రూపాయలు ఖర్చు చేసి పెంచిన మొక్కలు అగ్నికి ఆహుతి కావడంతో పల్లె ప్రకృతివనాల నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**సన్యాసికుంటలో కనిపించని మొక్కలు**

తుంగెడ పంచాయతీ పరిధిలో తుంగెడ, కొత్తగూడ పల్లె ప్రకృతివనాలతో పాటు సన్యాసికుంట సమీపంలో అధికారులు మరో పల్లె ప్రకృతివనాన్ని ఏర్పాటు చేశారు. ప్రకృతివనం చుట్టూ కంచెతో పాటు గేట్ కూడా ఏర్పాటు చేశారు. అయితే ప్రకృతివనం ఏర్పాటుపై చూపిన శ్రద్ధ దాని నిర్వహణపై చూపించకపోవటంతో మొక్కలు లేక వెలవెలబోతోంది. నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతలు విస్మరించడంతో మొక్కలు ఎండిపోయి ఖాళీ స్థలమే దర్శనమిస్తుంది.

## అటెన్షన్ ప్లీజ్.. సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి



దహెగాం: మండల కేంద్రం నుంచి కాగజ్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న మూలమలుపులతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఐనం గ్రామం వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపుల వద్ద తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సంబంధిత అధికారి: లక్ష్మీనారాయణ, ఆర్‌అండ్‌బీ డీఈ
సెల్ నంబర్: 9440818432

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

కాగజ్‌నగర్‌టౌన్: ఈనెల 7న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పట్టణంలోని శ్రీ కృష్ణనగర్ కాలనీకి చెందిన టీస్టాల్ శ్రీను కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హామీ ఇచ్చారు. బుధవారం జరిగిన అంత్యక్రియల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన శ్రీను కుటుంబ సభ్యులను ఓదార్చి, అంత్యక్రియలకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

**హరీశ్‌బాబు పరామర్శ**

సిర్పూర్ నియోజకవర్గ భాజపా నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు సైతం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానన్నారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు.

## ‘పది’ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

కౌటాల: కౌటాల ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు బుధవారం స్థానిక బీసీ హాస్టల్‌లో హైదరాబాద్‌కు చెందిన దంపతులు శ్రీరాముల అశోక్ -అనూష ఉచితంగా పరీక్షప్యాడ్లతో పాటు ఇతర సామగ్రి అందించారు. పాఠశాల కమిటీ చైర్మన్ రామచంద్రనాయక్, హెచ్‌ఎంలు మార్త రమేష్, గోడం నానాజీ, జాగృతి మండల కన్వీనర్ మార్త చంద్రకళ, ఉపాధ్యాయులు రాజబాబు, హరీష్, దేవన్న, లాలాజీ పాల్గొన్నారు.



పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న దంపతులు

## ‘బెదిరించడం సరికాదు’

కెరమెరి: చెరుకు సుధాకర్‌ను కాంగ్రెస్ నాయకుడు కోమట్‌రెడ్డి వెంకట్‌రెడ్డి బెదిరించడం సరికాదని మోకుదెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వెంకట్‌రెడ్డి అంగబలం చూసుకుని ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. ఆయన వెంట నాయకులు గిరిగౌడ్, సంజీవ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## ‘మహిళా హక్కులను కాలరాస్తున్న పాలకులు’

ఆసిఫాబాద్‌అర్బన్: జనాభాలో 50శాతం ఉన్న మహిళలకు అన్ని రంగాల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించకుండా మహిళల హక్కులను పాలకులు కాలరాస్తున్నారని సీనియర్ న్యాయవాది రజిహైదర్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్, అసెంబ్లీ, మంత్రివర్గంలో, సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల నియామకాల్లో, ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్‌లలో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు సతీష్‌బాబు, కిశోర్, చంద్రకుమార్, శ్యాంరావ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయవాదులు

## పేదలకు అండగా ప్రభుత్వం

కౌటాల: రాష్ట్రంలోని పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో మండలంలోని తలోడి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఆయన బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందించారు. ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తిరుపతి, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు మధుకర్, బాపు, సంతోష్, రాంచందర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న ఎంపీపీ విశ్వనాథ్

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

కాగజ్‌నగర్‌టౌన్: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ. 3,88,000 విలువ గల చెక్కులను బుధవారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ఆయా వార్డుల్లో బాధితులకు అందజేశారు. బాధితుల ఇళ్లకు వెళ్లి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సెలర్లు జుపాక మదన్, పిర్సింగుల జైచందర్, బాబా, నాయకులు వనమాల రాము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు పంపిణీ చేస్తున్న నాయకులు